

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సభ్యుడిగా ఏలూరు ఎంపీ పుట్టా



ఏలూరు టూ టౌన్, అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌ను నియమిస్తూ భారత ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే ఆయన ఇంధనం, సహజ వాయువు స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా నిధులు రావడానికి కృషి చేస్తానన్నారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావం వల్ల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో కలుస్తున్న ఉపనదులు శబరి, ప్రాణహిత, మంజీర, సీలేరు నదుల ప్రభావంతో శనివారం గోదావరి నీటిమట్టం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 1,13,436 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్టు డీఈ మాధవరావు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.330 మీటర్లు, స్పిల్‌వే దిగువన 17.200 మీటర్లు నీటిమట్టం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

ఉచిత సిలిండర్ రెడీ



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అర్హులు 5.67 లక్షల మంది

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- తెల్లకార్డుదారులకు లబ్ధి
- బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి
- నాలుగు నెలలకు ఒక బండ ఉచితం

జిల్లాలో 6.25 లక్షల గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. అందరికీ ఉచిత గ్యాస్ పథకం వర్తించదు. కేవలం తెల్ల రేషన్ కార్డుదారులకు మాత్రమే పంపిణీ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 5.67 లక్షల మంది తెల్ల రేషన్ కార్డుదారులున్నారు. వారందరికీ ఉచిత గ్యాస్ అందనుంది, ఉచిత గ్యాస్ కోసం జిల్లాలో ప్రభుత్వం ఏటా దాదాపు రూ.170 కోట్లు వెచ్చించనుంది. ఇప్పటికే అధికారులు ఉచిత గ్యాస్‌ను పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ చేయనుంది. కేవలం 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాలోకి సొమ్ములు వేయనుంది. ఎప్పటికప్పుడు గ్యాస్ ధరలు మారుతూ వస్తున్నాయి. ధరలకు అనుగుణంగానే ప్రభుత్వం ఉచిత గ్యాస్ భారాన్ని మోయనుంది.

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మరో హామీని అమలు చేయనుంది. ఉచిత గ్యాస్ సిలిండర్‌లను లబ్ధిదారులకు అందజేయనుంది, ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. వాస్తవానికి ఎన్నికల ముందే సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఏడాదికి మూడు సిలిండర్‌లు అందజేస్తామని ప్రకటించింది. దీపావళి నుంచి ఆ పథకాన్ని నెరవేర్చనున్నారు. జిల్లా అధికారులకు మార్గదర్శకాలు రానున్నాయి. ఇప్పటికే అర్హుల కోసం ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేస్తూ జీవో జారీచేసింది. అర్హులు తెల్లకార్డుదారులై ఉండాలి. రాష్ట్రంలో నివాసితులు కావాలి. అలాగే కేంద్ర ప్రభుత్వం జమ చేస్తున్న రాయితీ బ్యాంకు ఖాతా కూడా మనుగడలో ఉండాలి. కేంద్రం ఒక్కో గ్యాస్ సిలెండర్‌కు రూ.10 మాత్రమే రాయితీ ఇస్తోంది, ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం మూడు సిలిండర్‌లు ఉచితంగా ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వృద్ధాప్య పెన్షన్ పెంచి లబ్ధిదారులకు అందజేస్తోంది. నెలకు రూ.4 వేలు వంతున పంపిణీ చేస్తోంది. తాజాగా ఉచిత గ్యాస్ సిలిండర్‌లతో ప్రతి కుటుంబానికి ఏడాదిలో రూ.3 వేల లబ్ధి చేకూరనుంది.

మార్చి 31 వరకు అర్హత

ఉచిత గ్యాస్ దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31వ తేదీ వరకు అర్హత ఉంటుంది. అప్పటిలోగా ఎవరైనా ఉచిత గ్యాస్ సిలిండర్‌లను తీసుకోవచ్చు. తెల్లరేషన్ కార్డుదారులందరూ ఉచిత గ్యాస్‌కు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ఏడాది మార్చి నాటికి ఒక్క సిలిండర్ మాత్రమే వస్తుంది. ఆ తర్వాత ఏడాది మూడు సిలిండర్‌లు పంపిణీ చేయనుంది. ఇప్పటికే ఆర్థిక సంవత్సరం సగానికిపైనే ముగిసింది. కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్‌కు ఆర్థిక సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుంది. ప్రతి ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణించి మూడు గ్యాస్ సిలిండర్‌లు అందచేస్తారు. నాలుగు నెలలకు ఒక్కటి మాత్రమే ఇస్తారు. అదికూడా ఏ రోజు తీసుకునేందుకైనా లబ్ధిదారునికి అవకాశం ఉంటుంది. ఆ ప్రాతిపదికన ప్రభుత్వం మూడు సిలిండర్‌లను ఉచితంగా అందజేసేందుకు ప్రణాళిక రచించింది. మొత్తంపైన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేయడానికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉచిత గ్యాస్ కోసం లబ్ధిదారులు సైతం ఎదురుచూస్తున్నారు.



సైకిల్.. సిలిండర్ !

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు.. జూనియర్ చంద్రబాబుగా పిలిచే ఆచంటకు చెందిన ఆండ్రు లక్ష్మణరావు కూటమి ప్రభుత్వ ఉచిత గ్యాస్ సిలిండర్లపై వినూత్న ప్రదర్శన చేశారు. ఈ నెల 31 నుంచి మహిళలకు చంద్రబాబు సర్కార్ ఉచిత గ్యాస్ సిలిండర్ ఇవ్వనుంది. దీనిపై లక్ష్మణ్ శనివారం తన సైకిల్‌ను ప్రత్యేకంగా అలంకరించి పైన గ్యాస్ సిలిండర్ పెట్టి ప్రచారం చేయడంపై పలువురు అభినందించారు.

- ఆచంట/ఆంధ్రజ్యోతి:

అమ్మిన భూమినే అమ్మేస్తున్నారు



కొనుగోళ్లు, అమ్మకాలు సాగిస్తున్న అటవీ భూమి

నర్సుపేటలో భూదందా

- చేతులు మారుతున్న లక్షలు
- కొనుగోలుదారుల లబోదిబో

నూజివీడు ప్రాంతంలో భూదందాలకు మళ్లీ తెరలేచింది. పూర్వం జమీందారీల ఆధీనంలో వున్న వేలాది ఎకరాల అటవీ భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. అటవీ శాఖ ఆధీనంలో వున్న ఈ భూముల్లో వందల ఎకరాల భూమికి కొందరు నకిలీ పత్రాలు సృష్టించి ల్యాండ్ ట్రిబ్యునల్ ద్వారా పట్టాలు పొందారు. అలా జమీందారులు ఇచ్చిన వాటిల్లో నర్సుపేట భూమి ఒకటి. వీటిని అమ్మకూడదు. కాని అమ్మిన భూములనే మళ్లీ మళ్లీ అమ్మేస్తున్నారు.

నూజివీడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం నర్సుపేటలో 1,867 ఎకరాల భూమి ఉంది. దీనిలో 400 ఎకరాలకు చెట్టు పట్టాలు కాని, రైట్ ఆఫ్ ఫస్ట్ రెఫ్యూజల్ (ఆర్వోఎఫ్ఆర్) పట్టాలు ఇచ్చారు. వీటిని పొందిన పేద లబ్ధిదారులకు భూమిని అమ్మే హక్కు ఉండదు. వాటి ఫలసాయం తరతరాలు పొందవచ్చు. ఈ నర్సుపేట పరిధిలోనే నాడు జమీందారులు ప్రభుత్వానికి సుమారు మరో 400 ఎకరాల భూమిని అప్పగించకుండా తమ వేట కోసం (వినోదం కోసం) ఉంచుకున్నారు. తదనంతరం జమీందారులు కనుమరుగవడంతో ఈ 400 ఎకరాల భూమి ఎవరి ఆధీనంలో లేకుండా అలాగే ఉంది.



కంచె వేయటానికి రెడీ చేసిన స్తంభం రాళ్లు

పదేపదే అమ్మకాలు

ఈ నర్సుపేట పరిధిలో గతంలో ఒక భూమాఫియా ఏర్పడింది. నకిలీ పట్టాలు చూపుతూ చౌకగా భూములు అమ్మడం ప్రారంభించారు. నిజమైన పట్టాలు ఉన్న వారిలో కొందరిని ప్రలోభపరిచి భూమిని అమ్మండి, ఎకరానికి రూ.3 లక్షలు వస్తాయి. డబ్బులు అందిన తర్వాత అడ్డం తిరగండి. మీ భూమి మీచేతుల్లోనే ఉంటుంది. భూమి కొన్నవాడు కనీసం కేసు పెట్టడానికి అవకాశం ఉండదని ఆశ చూపుతూ గతంలో పదేపదే ఈ ప్రాంత భూములను అమ్మారు. ఇదే సంస్కృతి ఇప్పుడు మళ్ళీ తిరిగి మొదలైంది.

కొందరు తమకు 80 ఎకరాలకు, 40 ఎకరాలకు పట్టాలు ఉన్నాయని, ఆ భూమి ఎక్కడ ఉందో తమకు తెలియడం లేదని, ఆ భూమిని తమకు చూపాలని రెవెన్యూ సిబ్బందిని కోరారు. సుదీర్ఘకాలం ఇక్కడ లేనందున వాటిని చూపడం సాధ్యం కాదని రెవెన్యూ సిబ్బంది చేతులెత్తేయడంతో వీరు భూఅమ్మకాల ముఠాను ఆశ్రయించారు. ఈ ముఠా రంగంలోకి దిగి నకిలీ పట్టాలు ఉన్న వారిని వీరికి పరిచయం చేసి 40 ఎకరాల భూమి కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్‌లు చెల్లించారు.

కంచెకు సిద్ధం

అడ్వాన్స్‌లు ఇచ్చి భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు ఫెన్సింగ్ (కంచె) వేయడానికి రెడీ అయ్యారు. దానికి కావాల్సిన సామగ్రిని పొలాల వద్దకు తరలించడంతో విషయం బయటకు పొక్కింది. నర్సుపేటలో ఆర్వోఎఫ్ఆర్ భూములు అమ్మకాలు, కొనుగోళ్లు చేయడం ప్రభుత్వ నిబంధనల ప్రకారం కుదరదని రైతులు సీపీఐ రాష్ట్ర నాయకుడు చలసాని వెంకట రామారావు ఆధ్వర్యంలో హెచ్చరిక బ్యానర్లు కట్టారు. దీంతో కంచె వేసే కార్యక్రమం తాత్కాలికంగా ఆగింది. అటవీ భూముల కొనుగోళ్ళు, విక్రయాలు ప్రారంభించిన ల్యాండ్ మాఫియా సంబంధిత భూముల్లోకి రహదారులను నిర్మించే సాహసానికి ఒడికట్టింది. కొంతదూరం రహదారి నిర్మించారు. విషయం వెల్లడి కావడం తో అది తాత్కాలికంగా ఆగింది. భూమి కొను గోలు చేసిన వాళ్లు రాష్ట్ర మంత్రి, కీలక యువ నేత పేరును వాడుతున్నారు. ప్రభుత్వమే ఫెన్సింగ్ వేయమందని ప్రచారం చేస్తున్నారు.



ప్రభుత్వ ఆదేశాలు లేవు

నర్సుపేట భూముల్లో 200 ఎకరాల భూములకు కంచె వేయమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయా ? అని నూజివీడు ఫారెస్ట్ రేంజర్ సత్యనారాయణని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆయన అలాంటి ఆదేశాలు ఏమీ ప్రభుత్వం నుంచి లేవని, ఎవరు కంచెను అటవీ భూమిలో వేయడానికి వీలులేదని చెబుతూ తాను ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించానని, వెంటనే ఈ విషయం పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

టెన్త్ పరీక్షల ఫీజు రూ.125



విద్యార్థులు రేపటి నుంచి నవంబరు 11లోపు చెల్లించాలి

భీమవరం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్‌ల్లో జరిగే ఎస్ఎస్‌సి, ఓఎస్ఎస్‌సి, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, గతంలో అనుత్తీర్ణత పొంది, ఇప్పుడు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 28వ తేదీ నుంచి పరీక్ష ఫీజు చెల్లించవచ్చని విద్యా శాఖ ప్రకటించింది. అపరాధ రుసుం లేకుండా నవంబరు 11 వరకు, 50 రూపాయల అపరాధ రుసుంతో నవంబర్ 18 వరకు, రూ.200తో 25 తేదీ వరకు, రూ.500తో 30వ తేదీ వరకు చెల్లించవచ్చని డీఈవో నారాయణ తెలిపారు.

- రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు ఫీజు రూ.125.
- మూడుకన్నా ఎక్కువ సబ్జెక్టులకు రూ.125.
- మూడు సబ్జెక్టుల వరకు రూ.110.
- ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాలి.
- మైగ్రేషన్ సర్టిఫికెట్‌కు రూ.80.

వయస్సు

- పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వయసు 14 ఏళ్లు నిండి ఉండాలి. అంటే 2010 ఆగస్టు 31వ తేదీకి ముందు జన్మించి ఉండాలి. 14 ఏళ్లు నిండకుంటే ఏజ్ కండోనేషన్ చేయవచ్చు.
- గవర్నమెంట్, మున్సిపల్, జడ్పీ విద్యార్థులకు హెచ్‌ఎంలు ఒకటిన్నర ఏళ్ల ఏజ్ కండోనేషన్ చేయవచ్చు.
- ఎయిడెడ్ మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు డీఈవో ఒకటిన్నర ఏళ్లు కండోనేషన్ చేస్తారు. వీరు డీఈవోకు దరఖాస్తు చేసుకునే ఆఖరు తేదీ నవంబరు 7.

పట్టణ స్వరూపం మార్చేలా..

అభివృద్ధి ప్రణాళికలు

వార్డుల వారీగా సర్వేలు, రోడ్లు, రిజర్వ్ స్థలాలు, డోర్ నెంబర్ల గుర్తింపు

భీమవరం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ప్రాంతీయాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వార్డుల వారీగా మ్యాప్‌లను రూపొందించనుంది. అధికారులు రహదారులను సర్వే చేసి ప్రణాళికల్లో నమోదు చేస్తారు. ప్రతీ ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికలలో 30 అడుగుల రోడ్లు ఉండేలా చూస్తారు. ప్రస్తుతం విస్తరించి వున్న రోడ్ల విస్తీర్ణాన్ని పరిశీలిస్తారు. విస్తీర్ణం తక్కువగా వున్న వాటిని అదే వార్డులో ప్రధాన రోడ్లకు అనుసంధానమయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తారు. తద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరనుంది. ప్లాన్‌ల అనుమతి సులభతరం కానుంది.

పట్టణ ప్రణాళికదే భాధ్యత

భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం మునిసిపాల్టీల్లో సర్వే చేసే బాధ్యత పట్టణ ప్రణాళిక విభాగాలకే అప్పగించారు. ఈ అధికారులు వార్డుల వారీగా పదడుగుల రహదారిని నమోదు చేస్తారు. వీధులతోపాటు ప్రధాన జంక్షన్‌లను గుర్తిస్తారు. గతంలోనే ఈ సర్వే నిర్వహించినప్పటికి అధికారికంగా నమోదు చేయలేదు. ఇప్పుడు మరోసారి సర్వే చేస్తున్నారు. ఆ దిశగా పట్టణ ప్రణాళిక సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది.

ప్లాన్‌లు సులభతరం

ప్రాంతీయ ప్రణాళిక అభివృద్ధి ద్వారా స్థల యజమానులకు ఎంతో ప్రయోజనం కలుగనుంది. రహదారి చిన్నగా ఉన్నప్పుడు 30 అడుగులు తీసుకుని ప్లాన్ ఇచ్చేవారు. ఉదాహరణగా పదడుగులు ఉంటే ఇరు వైపుల 10 అడుగులు మునిసిపాల్టీకి రిజిస్ట్రేషన్ చేయాలి. అప్పుడే ప్లాన్ ఇచ్చేవారు. ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికలో పదడుగుల రహదారికి అనుమతి లభిస్తే మునిసిపాల్టీకి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ఇప్పటికే నిర్మించిన ఇళ్ళను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంటుంది. దీంతో బ్యాంకు రుణాలు మంజూరవుతాయి. అందుకోసమే సమగ్ర సర్వే నిర్వహించి ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయనున్నారు.



భీమవరంలో పైలెట్ ప్రాజెక్టు

ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళిక (ఏడీపీ) తయారు విషయంలో భీమవరం మునిసిపాల్టీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే గునుపూడిలో 17వ వార్డులో మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్రహ్మణ్యశర్మకు సంబంధించిన ఒక భవన నిర్మాణం ఆమోదం కోసం ఉన్నతాధికారులు ఏడీపీ చేసి బీపీఎస్‌కు అనుమతి ఇవ్వాలని అప్పట్లో అధికారులు ఆదేశాలు జారీచేశారు. మునిసిపల్ అధికారులు చేసిన సర్వేకు ఉన్నతాధికారుల నుంచి ఆమోదం లభించింది. అదే ఇప్పుడు సర్వేకు మార్గదర్శకంగా నిలుస్తోంది. అప్పట్లో ప్రతీ అంశాన్ని గుర్తించి ఏడీపీని అధికారులు సిద్ధం చేశారు. దీనిపై ఉన్నతాధికారులుఒకటికి రెండుసార్లు పూర్తిస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత ఆమోదం లభించింది. దీంతో ఆ వార్డులో చిన్న రహదారుల్లోను ప్లాన్ మంజూరయ్యే అవకాశం లభించింది.

సంచార వైద్యానికి సుస్తీ





పశువుల వైద్య వాహనాలు ఎక్కడ ?

భీమవరం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) :సంచార పశు వైద్యశాలలు సరిగా పనిచేయడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు సంస్థతో చేసుకున్న ఒప్పందం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మారింది. సిబ్బంది లేక వాహన మరమ్మతులతో సంచార వాహనాలు కదలడం లేదు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 14 సంచార పశు వైద్యశాలలు వాహనాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఆరు మూలనపడ్డాయి. ఒక వాహనంలోని వైద్యమందించే డాక్టర్ లేకపోవడం, మరో ఆరు వాహనాలకు డ్రైవర్ కం అటెండర్లు లేకపోవడంతో వైద్య సేవలు నిలిచిపోయాయి. పనిచేస్తున్న వాహనాలలో ఆరింటికి హైడ్రాలిక్ లిఫ్ట్ పనిచేయడం లేదు. దీనివల్ల పశువులను వాహనంపై ఎక్కించడం ఇబ్బందిగా మారింది. ఇలా ఏదో ఒక సమస్యతో సేవలు నిలిచిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామాల్లో పశువులకు వైద్యం అందుబాటులో ఉండేలా సంచార వైద్యశాలలు ఏర్పాటుచేశారు. గత వైసీపీ ప్రభుత్వం జీవీకే యాజమాన్యంతో నిర్వహణ ఎంవోయు కుదుర్చుకుంది. ప్రైవేటు సంస్థ కావడంతో ప్రభుత్వ పశుసంవర్థక శాఖకు వాటి నిర్వహణ సంబంధం లేకపోయింది. ఆ సంస్థ వారే డాక్టర్‌లు, అసిస్టెంట్‌లు, డ్రైవర్‌లను ఏర్పాటు చేసుకున్నారు. డ్రైవర్‌కు నెలకు వేతనం రూ.12 వేలు ఇవ్వడంతో వారు నిలకడగా పనిచేయడం లేదు. అదే ఇప్పుడు వాహనాలు కదలని పరిస్థితికి చేరింది. ఇతర ప్రాంతాల నుంచి వైద్యులను తీసుకురావడంతో వారిలో ఒకరు అందుబాటులో లేదు. ఏడాదిన్నర నుంచి సంచార పశు వైద్యశాలలు పనిచేశాయి. ఏదో ఒక సమస్యతో వైద్య సేవలు పశువులకు అందడం లేదు. దీనికి ఒప్పందం కుదుర్చుకున్న ప్రైవేటు ఏజెన్సీ ఒక కారణమైతే, ఆ ఏజెన్సీకి ప్రభుత్వం నుంచి అందాల్సిన సొమ్ములు కోట్లలో పెండింగ్‌లో ఉండడం మరో కారణం.



పశు సంచార వైద్యశాలలు వచ్చాక పశువులకు వైద్యం మరింత అందుబాటులోకి వచ్చింది. అయితే అవి ఏదో సమస్య ఉందంటూ కొన్ని సమయాలలో అందుబాటులోకి రావడం లేదు. సక్రమంగా వాటికి సేవలందించేలా చూడాలి.

- వై.మహేష్, రైతు, వీరవాసరం

వైద్యమందించాల్సింది ఇలా..

సంచార పశు వైద్యశాలలు గ్రామాలలో తిరుగుతూ ఉండాలి. అత్యవసరంగా 1962 నెంబర్‌కు కాల్ చేస్తే ఆ ప్రాంతానికి వెళ్ళి వైద్యం అందించాలి. పశువుకు ఎమర్జెన్సీ అయితే సంచార పశు వైద్యశాల ద్వారా దగ్గరలోని పశువుల ఆసుపత్రికి చేర్చి మెరుగైన వైద్యం అందించాలి. ఉదయం తొమ్మిది నుంచి నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇవి పనిచేస్తాయి. ఆదివారం సెలవు. పశువుల యజమానులు వీటి సేవలను బాగా వినియోగించుకునే సమయాల్లో ఏదొక కారణంతో వాహనాలు నిలిచిపోవడం సరైనది కాదని రైతుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి దీనిని గాడిన పట్టాల్సిన అవసరం వుందని రైతులు కోరుతున్నారు.



104లో మందుల్లేవ్..

పాలకోడేరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు అన్నిరకాల వైద్య చికిత్సలతోపాటు మందులను అందించి వారి ఆరోగ్య భద్రతను కల్పించే విధంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన 104 వాహనాలు నిరుపయోగంగా మారుతున్నాయా? అంటే అవునంటున్నారు గ్రామీణ ప్రజలు. జిల్లాలోని 38 పీహెచ్‌సీలు, 14 అర్బన్ హెల్త్ సెంటర్లలో 31 వాహనాలున్నాయి. ఈ 104 వాహనాల ద్వారా వైద్యులు ప్రజల వద్దకే వెళ్లి వైద్యమందించి మందులను ఉచితంగా అందజేసేవారు. కొంత కాలంగా సరైన మందులు లేకపోవడంతో ప్రజలు, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. 2008లోనే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు వైద్యాన్ని అందించడం మొదలుపెట్టారు. గత ప్రభుత్వం 2020 జూలై 1న ప్రభుత్వం ఆధ్వర్యంలోనే అరబిందో సంస్థ ద్వారా గ్రామీణ సంచార చికిత్స కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ వాహనం ద్వారా బీపీ, షుగర్, హెచ్‌పీ, యూరిన్, యూరిన్ షుగర్, యూరిన్ ప్రెగ్నెసి, మలేరియా, క్లోరినేషన్ టెస్టులతోపాటు ఈసీజీ టెస్టులు ఈ వాహనంలో ఉచితంగా అందిస్తున్నారు. ఈ వాహనంలో 77 రకాల మందులు అందించాల్సి వుండగా, ఇందులో సగానికి సగం ఉండటం లేదని చెబుతున్నారు. గ్రామాల్లో ప్రతీ ఒక్కరూ గ్యాస్ట్రిక్, ఒళ్ళునొప్పులు, జలుబు, జ్వరం, దగ్గుతోపాటు బలహీన లక్షణాలతో ఉంటుంటారు. ఇందుకు కావాల్సిన మందులు ఇవ్వడంలేదు. ముఖ్యమైన డోలో 650, మల్టీ విటమిన్, ఐరెన్, డైక్లోఫ్యాన్‌టాప్, ప్రగాల్బిన్, లివోసిట్రోజన్, ఎమాక్సిలిన్‌క్లావిట్, సిఫిక్సిజిమ్, మెట్రోజెల్, ఫ్రాజోల్డిన్, కాలిష్యం, కొలస్ట్రాల్ టాబ్లెట్స్ లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

మరోవైపు ఈ వాహనాల్లో పనిచేస్తు న్న 72 మంది డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

అధిక సంతానం వైపు సాగాలంటూ సీఎం చంద్రబాబు పిలుపు

పిల్లల్ని కనండి !



ఒకప్పుడు ఒకరు ముద్దు.. ఇంకొకరు వద్దు

ప్రస్తుతం కంటూనే ఉండండంటూ సరికొత్త రాగం

'ఒకరు ముద్దు.. ఇంకొకరు వద్దు' అనే నినాదం ఒకనాటి తరానికి చిరపరిచితమే. కాస్తంత ఈ నినాదంవైపు తొంగి చూసినవారంతా అక్షరాలా పాటించారు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు దేదీప్యమానంగా వెలిగిన రోజుల్లో ఉన్న పరిస్థితులకు ఇప్పుడున్నవన్నీ భిన్నమే. ఒకప్పుడు జనాభా పెరిగిపోతుందని ఆందోళన చెందారు. 1960, 1970 సంవత్సరాల్లో జనాభా పెరుగుదల ఆశించినదానికన్నా అత్యధికమే. ఇదేవిధంగా జనాభా దూసుకుపోతే భవిష్యత్ అత్యంత దుర్లభమని ఇంటి పెద్దలు ఆందోళన చెందారు. తదుపరి తరానికి ఒకరిద్దరితో సరిపెట్టుకోండంటూ నచ్చచెప్పారు. 1990 సంవత్సరంలోకి వచ్చేసరికి ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. కంటే ఒకరినే కనాలి.. కుటుంబం ఆర్థిక భారంతో కుంగిపోకూడదు. ఈమేరకు అత్యధిక నివాసాల్లో ఒక్కొక్కరే సంతానం. ఒకప్పుడున్న పరిస్థితులకు ఇప్పుడున్న పరిస్థితులకు మధ్య వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న తరుణంలోనే.. మళ్ళీ కొత్త నినాదం. ఒకరిద్దరితో సరిపెట్టుకోవద్దు.. ఏకంగా సంతానాన్ని కనండంటూ.. పెరుగుతున్న వయోవృద్ధులు, తరుగుతున్న కుర్రకారు దీనికి ప్రధానకారణం. ఇప్పుడున్న వ్యవస్థలో అత్యధిక సంతానం క్షేమమా, కాదా అనేది పక్కనపెడితే భారమే నంటూ తలూపేవారే ఎక్కువ.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

అప్పటి పరిస్థితులు వేరు..

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మానవాళి మనుగడలో మార్పులు, చేర్పులు జరిగాయి. అన్నిటికంటే మించి ఉమ్మడి కుటుంబాలు దీర్ఘకాలం కొనసాగాయి. మంచి వచ్చినా, చెడొచ్చినా ఒకరికొకరు తోడు. సంక్రాంతి వచ్చిందంటే అంతా ఏకమై నిజమైన పండుగ చేసుకునేవారు. అప్పటికీ ఇప్పటికీ ఆంధ్రా ప్రాంతానికి ఇదే అతిపెద్ద పండుగ. ఒకనాడు జనన మరణాలు రిజిష్టర్‌ను గమనిస్తే 1970లో జననాల సంఖ్య అత్యధికంగా ఉన్నట్టు కనిపిస్తుంది. అప్పటి నుంచి సరాసరిన జనాభా 1980 వరకు కొనసాగుతూనే వచ్చింది. అప్పట్లో సరాసరి సంతానం ముగ్గురు లేదా నలుగురు. మరికొన్ని కుటుంబాల్లో ఎంతమంది పుడితే.. అదంతా దేవుడి దయగానే భావించేవారు. నారు పోసినవారు నీరు పోయరా అన్న చందంగా కనిపెంచిన పిల్లలను చూసి పెద్దలు దీర్ఘాలు తీసేవారు. ఎక్కడా ఖర్చుకి వెనుకాడేవారుకాదు. దీనికితోడు 1960 నుంచి 1980 వరకు నిత్యావసరాలు అందుబాటులో ఉండేవి. రూపాయి మారకం అప్పటితో పోలిస్తే ఇప్పుడు క్షీణ దశలోనే ఉంది. ఉప్పులు, పప్పులు అందుబాటులో ఉండేవి. అంతకంటే మించి

» పెరుగుతున్న వృద్ధుల సంఖ్యతో ముందు జాగ్రత్తలు

» ఇప్పటితరానికి ఇది భారమే..

» ఆ దిశగానే తలూపుతున్న అత్యధికులు

» ఒకరితోనే సరిపెట్టుకుంటున్న కుటుంబాలు అనేకం

వ్యవసాయ ఆధారిత కుటుంబాలే అత్యధికం. పాడి, పంట చేతినిండా ఉండేది. పెళ్ళిళ్ళు పబ్బాలు ఇంటి ముంగిటే జరిగేవి. చావుకైనా, పెళ్ళికైనా వచ్చే బంధువులకు ఏలోటూ లేకుండా చూసేశారు.

రానురాను.. తిరగబడుతూ..

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలన్నీ సంపూర్ణ జీవతం అనుభవించేవి. కష్టం, సుఖం సమానంగా పంచుకునేవారు. రానురాను ఉమ్మడి కుటుంబాలన్నీ విచ్ఛిన్నం అవుతూ వచ్చాయి. మూడుముళ్ళు పడిన మరు క్షణంలోనే వేరు కుటుంబాలకు సిద్ధపడుతున్నారు. ఇంటి పెద్దరికం నామమాత్రమైంది. ఒంటరి కుటుంబం కాబట్టి ఒకరిద్దరి కంటే పిల్లలను సాకడం తేలికైన పనికాదని, అనుభవానికి వచ్చిన వెంటనే ఆయా కుటుంబాలు సరిపెట్టుకుంటూ వచ్చాయి. మహా అయితే మగ పిల్లాడంటూ ముగ్గురు వరకు ముందడుగు వేసేవారు. కాని ఆ పరిస్థితులలోనూ తడబాటు కనిపిస్తూ వచ్చింది. ఒకరిద్దరే చాలంటూ అంతకంటే మించి ఏ మాత్రం పోరాదంటూ తమకు తామే గీత గీసుకోవడం కొన్ని కుటుంబాల్లో ఆరంభమైంది. చదువు సంధ్య భారం కావడం, ప్రభుత్వ పాఠశాలలకు బదులుగా ప్రైవేటు బడులు దూసుకు రావడంతో కుటుంబ చిత్రమే కొంతలో కొంత మారింది. ఏ ఫీజు లేని సర్కారు బడిని తేలిగ్గా తీసుకుని కాన్వెంట్‌లకు పిల్లలను పంపించే వారంతా ఆర్థిక భారాన్ని ఎదుర్కోవడం, దీనికితోడు పల్లె సీమల్లో ఉన్నవారికి రోజువారీ కుటుంబ ఖర్చులు తడిసిమోపెడు కావడం సరికొత్త అనుభవాలు వచ్చాయి. కనే పిల్లల సంఖ్య అదుపు చేయాలన్న ధ్యాసకొచ్చారు. ఒకరిద్దరు కాదు.. ఒకరే ముద్దు అనే నినాదానికి తలొగ్గారు. ఈ కోణంలోనే ఇప్పటికీ చాలా కుటుంబాల్లో ఏకైక కొడుకు లేదా కూతురు మాత్రమే దిక్కు. పెరుగుతున్న వయోభారం ఒక్కొక్కరే ఉండడం, దీనికితోడు పుట్టిన ఒక బిడ్డ కూడా దూరప్రాంతాల్లో ఉద్యోగం నిమిత్తం స్థిరపడడం ఇప్పటి కుటుంబ వ్యవస్థ తీరును చాలా వరకు మలిచింది. అత్యధిక కుటుంబాల్లో ఒక బిడ్డే చాలంటూ ఇప్పటికీ కట్టుబడిన వారి సంఖ్యే ఎక్కువ. కాని ఇంకోవైపు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వయోవృద్ధుల సంఖ్య రాబోయే దశాబ్ద కాలంలో భారీగా పెరగడం, అదేక్రమంలో కుర్రకారు సంఖ్య క్షీణించడంతో ఇప్పుడు పాలకవర్గాలు కొత్త ఆలోచనల వైపు మళ్ళుతున్నాయి.

జనాభా సంఖ్యను పెంచాలంటూ సంకేతాలు

ఆడ పిల్లల సంరక్షణకు వీలుగా కంటే కూతురినే కనాలి అనే నినాదం కొనసాగినట్టుగానే ఇప్పుడు పిల్లల్ని కనండి అనే నినాదం ముందుకొచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం రానున్న వృద్ధుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు యువతరం దిశగా ముందడుగు వేయాలంటే జనాభాను పెంచాల్సిందేననట్టుగా సంకేతాలు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆయన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన నినాదం జాతి ప్రయోజనాల నిమిత్తం మంచిదే అయినప్పటికీ ఇప్పుడున్న ధరలు, మితిమీరిన ఖర్చులు, ప్రతీది భారంగా మారిన పరిణామాలు ఇలా ఒకటేంటి రోజువారీ కుటుంబ అవసరాల నిమిత్తం ఒకరి కంటే అత్యధికంగా ఇంట్లో భారంకాకపోతే ఏమవుతుందని లెక్కించే వారూ లేకపోలేదు. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా ఒకరితో సరిపెట్టుకోవడమే మేలనే ధోరణిలో అత్యధికులు నినాదం ఏదైనా కుటుంబ వ్యవస్థలో మార్పులు, చేర్పులు తరచూ అనివార్యమే అవుతున్నాయి.



పిల్లలను కనడం కంటే బాధ్యత వహించడమే కష్టం



తరాలు మారాయి.. పరిస్థితులు మారాయి. ఒకరి కంటే మించి సాకడమూ కష్టమే. కుటుంబ సభ్యుల మద్దతు లేకుండా పిల్లలను పోషించి పెద్ద చేయడం కష్టమే. ఇలాంటి పరిస్థితులన్నీ మనందరి కళ్ళెదుటే ఉన్నాయి. ఇద్దరు పిల్లలు ఉండడం కుటుంబానికి అన్ని విధాలా ఉపయోగం. ఈ రోజుల్లో పిల్లలను కనడం, పెంచి పెద్ద చేయడం బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడం అంత సులభమైన పనికాదు. ఇప్పుడు పిల్లలను ఎంతమందినైనా కనొచ్చనే నిర్ణయాలు భవిష్యత్తుకు మంచిదే అయినా నేడున్న పరిస్థితులకు మాత్రం విరుద్ధమే.


- మద్దు విజయలక్ష్మి, ఏలూరు

అంత సులువేమీ కాదు



ఇద్దరూ లేదా ముగ్గురు పిల్లలు ఉండడం బాగుంటుంది. మేము కూడా మా అమ్మానాన్నలకు నలుగురు పిల్లలం. కానీ తరాలు మారాయి. దీంతోపాటు పరిస్థితులు, కుటుంబ వ్యవస్థ కూడా మారింది. ప్రస్తుత కాలంలో వయస్సు మీరిన తరువాతే పిల్లలు పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. ఇంతకుముందు మాదిరిగా 18 ఏళ్ళకే పెళ్ళిళ్ళు లేనేలేవు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అందరం మారాలనే నిర్ణయాలు నిజమేకాని ఆ వెనుక ఉన్న కష్టనష్టాలు అందరూ గమనించాల్సిందే.

- కారింపూడి ప్రసన్న, నిడదవోలు



అష్టావక్ర.. కొబ్బరి

ఎనిమిది దశాబ్దాల నాటి ఈ అష్ట వంకరలు తిరిగిన కొబ్బరి చెట్టు నేటికీ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఎన్నో తుఫాన్‌ను, పెనుగాలులను సైతం తట్టుకుని సుమారు 30 అడుగుల ఎత్తుకు ఎదిగింది. ఈ చెట్టు ముదినేపల్లి మండలం సింగరాయపాలెం వద్ద ఉంది. 1936-37 సంవత్సరాల మధ్య అప్పట్లో శీలం వెంకయ్యకు చెంది ప్రస్తుతం ఆక్వా రైతు అబ్బిశెట్టి నాగబాబు అనుభవంలో ఉన్న పొలం ఎదురుగా పటిష్ఠంగా ఉండడం విశేషం.

- ముదినేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)



విద్యార్థులకు సాయమందించిన సినీ నటుడు గెటప్ శ్రీను తదితరులు

విద్యార్థులకు గెటప్ శ్రీను సాయం

ఆకివీడురూరల్, అక్టోబరు 26 : జీవితంలో వెలుగులు నింపేది విద్య ఒక్కటేనని సినీ నటుడు, గెటప్ శ్రీను అన్నారు. కళింగగూడెం లోని ఎంపీయూపీ పాఠశాలలో విద్య నభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.36,000 ఆర్థిక సాయమందించారు. ఐదో తరగతి విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున ఇద్దరికి, ఆరో తరగతిలో ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున ఇద్దరికి, ఏడో వ తరగతిలో ఒక్కొక్కరికి రూ. 5వేలు చొప్పున ఇద్దరికి, ఎనిమిదో వతరగతిలో విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.6వేలు చొప్పున అందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు కైకరం విద్యార్థులు

ఉంగుటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఈనెల 24న జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో కైకరం హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. శనివారం జరిగిన అభినందన సభలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన త్రోబాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో ఉల్లిబోయిన మేరీ(10వ), అండర్-14 విభాగంలో మద్దా రాము, సనపల కనక దుర్గ, పుప్పాల లిఖిత రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు నాగసుధ, పాపాయమ్మలను సర్పంచి సలగాల గోపి అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో అక్కాచెల్లెళ్లు అదుర్స్

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మానికల సుధారాణి

» అక్కబాటలో ప్రతిభ కనబరుస్తున్న చెల్లెలు మహాలక్ష్మి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 26 : జంగారెడ్డిగూడెం బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మానికల సుధారాణి అండర్-17 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు అర్హత సాధించింది. ఈనెల 21 నుంచి 23 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో జంగారెడ్డిగూడెం నుంచి ఎం.కోమలి, కె.శ్రీవల్లి, మానికల సుధారాణి పాల్గొన్నారు. వీరిలో సుధారాణి ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. 2023లో అరకులో జరిగిన అండర్-14 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలలో కూడా ఆడింది.





ఏలూరులో జేసీ ధాత్రిరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న సుధారాణి, మహాలక్ష్మి



అండర్-14 జాతీయస్థాయిలో కప్పు, మెడల్ సాధించిన సుధారాణి

అక్క బాటలో చెల్లెలు..

జంగారెడ్డిగూడెంకు చెందిన సుధారాణి చెల్లెలు మహాలక్ష్మి కూడా ఇదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. చెల్లెలు కూడా అక్క బాటలోనే వాలీబాల్‌లో ప్రతిభ కనబరుస్తుంది. గత ఏడాది తన అక్కతో పాటు అండర్-14 విభాగంలో భువనేశ్వర్‌లో జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో ఆడింది. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబా ల్ పోటీలలో కూడా మహాలక్ష్మి ఆడనుంది. గత ఏడాది జాతీయస్థాయిలో ఆడిన అక్కా చెల్లెళ్ళు ఇటీవల ఏలూరులో జరిగిన అంతర్జాతీయ బాలికల దినోత్సవం రోజున జేసీ ధాత్రి రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లతో పాటు సత్కారాన్ని పొందారు.

ఐపీఎస్ లక్ష్యం : సుధారాణి

త్వరలో జరగబోయే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో విజయం సాధిస్తా.. దేశానికి, రాష్ట్రానికి, పాఠశాలకు, అమ్మానాన్నలకు మంచి పేరు తీసుకువస్తా. పదో తరగతిలో అధిక మార్కులు సాధించి ఐఐటీ సీటు పొంది బీటెక్ చదువుతా.. తర్వాత ఐఏఎస్ అవ్వాలన్నదే లక్ష్యం. కలెక్టర్‌గా మా అమ్మానాన్నలను గౌరవంగా చూస్తూ.. పేదవారిని ఆదుకుంటా. ఫిజికల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ నరసింహరాజు ఎంతో ప్రోత్సహించారు.

సుధారాణి విద్యార్థులకు స్ఫూర్తి



విద్యార్థిని సుధారాణి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై మిగిలిన విద్యార్థులకు స్ఫూర్తి నిచ్చింది. విద్యార్థిని చెల్లెలు మహాలక్ష్మి కూడా వాలీబాల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తుంది. మా పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. పాఠశాలలో పలు ఆటలపై అనుభవజ్ఞులైన ఫిజికల్ డైరెక్టర్‌తో శిక్షణ అందిస్తున్నాం.

- పి.గ్లోరీ ప్రశాంతి, హెచ్‌ఎం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జంగారెడ్డిగూడెం

ప్రభుత్వం ప్రోత్సాహమివ్వాలి

మా విద్యార్థులకు వాలీబాల్, అథ్లెటిక్స్ త్రోబాల్, రన్నింగ్, ఖోఖో తదితర ఆటల్లో శిక్షణ ఇస్తున్నాం. 2017 నుంచి ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచారు. శిక్షణకు కావాల్సిన క్రీడా సామగ్రిని ప్రభుత్వం సమకూరిస్తే మరింత మందిని జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తాం.



- ఎం.వెంకటలక్ష్మి ఫిజికల్ డైరెక్టర్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల

అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

పెనుమంట్ర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్రీడాలతో శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదయం చేస్తాయని తణుకు డీవైఈవో మురళీసత్యనారాయణ కోరారు. శనివారం మార్టేరు వేణుగోపాలస్వామి జడ్పీ ఉన్నత పాఠశాలలో 69వ స్కూల్ గేమ్స్ అండర్-17 బాల బాలికల అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ టోర్నమెంట్, ఎంపికలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మార్టేరు క్రీడలకు పుట్టినిల్లని, బాస్కెట్‌బాల్ పేరు చెబితే వడాల ప్రహ్లాదరెడ్డి జ్ఞప్తికి వస్తారన్నారు. అంతర్జాతీయ క్రీడాకారుడు సత్తి సుబ్బన్నరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలని ఉద్దేశంతో పీవీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసి క్రీడాకారులకు తర్ఫీదునిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి టీఎస్ఎన్ మల్లేశ్వరరావు, బాస్కెట్బాల్ పరిశీలకులు శ్రీనివాస్, బాస్కెట్ బాల్ రాష్ట్ర కార్యదర్శి జిజచక్రవర్తి, పీవీఆర్ ట్రస్టు చైర్మన్ కె.సూర్యనారాయణ, వి.జాన్సన్, పీడీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





పోటీలను ప్రారంభిస్తున్న డీవైఈవో మురళీసత్యనారాయణ, పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పోటీల వివరాలు..

బాలుర విభాగంలో.. విశాఖ-గుంటూరు మధ్య జరిగిన పోటీలో 35-28, నెల్లూరు-శ్రీకాకుళం 34-07, కడప- కర్నూలు 08-12, ప్రకాశం- అనం తపురం 08-41, విజయనగరం-చిత్తూరు 06-23, గుంటూరు-శ్రీకాకుళం 40-20, నెల్లూరు-విశాఖ 59-48, తూర్పుగోదావరి-వైఎస్సార్ కడప 30-05 పాయింట్లతో గెలిచాయి.

బాలికల విభాగంలో.. శ్రీకాకుళం-చిత్తూరు 0-25, తూర్పుగోదావరి-నెల్లూరు 22-02, విజయనగరం-విశాఖపట్నం 0-30, వైఎస్సార్‌కడప-కర్నూలు06-18, ప్రకాశం-అనంతపురం 02-33, పశ్చిమగోదావరి- విజయనగరం 43-04, కృష్ణ-వైఎస్సార్ కడప 30-11, చిత్తూరు-నెల్లూరు 35-02, తూర్పుగోదావరి-శ్రీకాకుళం 42-02 పాయింట్లతో లీచ్ మ్యాచ్‌లు జరిగాయి.



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్వీ రంగరాజు, మురళీకృష్ణంరాజు

'ఎస్ఆర్‌కేఆర్'లో బాస్కెట్‌బాల్, నెట్ బాల్ పోటీలు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల పాటు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ అంతర్ కళాశాల బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల కమిటీ కన్వీనర్ డాక్టర్ పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ జేఎన్టీయుకే పరిధిలో బాస్కెట్‌బాల్‌కు ఇరవైఒక్క టీమ్స్, నెట్‌బాల్‌కు పది టీమ్స్ హాజరయ్యా రన్నారు. పోటీలకు పరిశీలకులుగా విజయవాడ లైలా కళాశాల నుంచి రాజేష్, ఒంగోలు డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ అథారిటీ నుంచి శ్రీనివాసరావు హాజరయ్యారన్నారు. నెట్‌బాల్‌కు వైజాగ్ డిస్ట్రిక్ అసోసియేషన్‌కు చెందిన బి.వెంకటేశ్వర్లు, పశ్చిమ గోదావరి జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ డి.ఖాన్ హాజరయ్యారని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి ఉమెన్ బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమాలు కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ హరిమోహన్, జి సారిక, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాలమ్

అథ్లెటిక్స్‌లో కైకరం విద్యార్థులు

» అండర్-14,17 రాష్ట్రస్థాయి పోటీలకు కైకరం జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

ఉంగుటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా అల్లూరు సీతారామరాజు స్టేడియంలో ఈనెల 22వ తేదీన జిల్లాస్థాయి పోటీల్లో కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చా రు. నవంబరులో కైకరం గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. భవిష్యత్తులో తాము ఉన్నతోద్యోగాలలో చేరి దేశ సేవ చేస్తామని అండర్-14 రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు తెలిపారు. తాము చదువుకున్న పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమవుతున్నామన్నారు. హైస్కూలులో సాధన చేస్తున్న భావి క్రీడాకారులను ఆంధ్రజ్యోతి పలుకరించగా భవిష్యత్ కార్యాచరణను వారి మాటల్లో వివరించారు.

పోలీసు ఉద్యోగం సాధిస్తా



జిల్లా స్థాయి 200 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం సాధించా. రాష్ట్ర స్థాయిలో రాణించి పోలీసు ఉద్యోగంలో చేరతా. తల్లిదండ్రులు శివ, లావణ్య, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉంది.

- కడింపల్లి మనోజ్‌కుమార్, 7వ తరగతి

మిలటరీలో చేరి దేశానికి సేవ చేస్తా



హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు, వ్యాయామ ఉపాధ్యాయుల తోడ్పాటుతో జిల్లా స్థాయి హై జంప్‌లో ఫస్ట్ సాధించా. తల్లి తండ్రులు రాంబాబు, ఉమాదేవి గొర్రెల కాపరిగా పనిచేస్తున్నారు. మిలటరీలో చేరి దేశానికి సేవలు అందిస్తా.

- ఆకుల సుభాష్, 8వ తరగతి

ఉత్తమ క్రీడాకారుడిగా ఎదుగుతా



జిల్లా స్థాయిలో 100 మీటర్ల పరుగులో తృతీయ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యా. భవిష్యత్తులో మంచి ఉద్యోగం కంటే క్రీడాకారుడిగా ఎదుగుతానన్నారు.

- కాటి దీవెన్‌కుమార్, 7వ తరగతి

వైద్య వృత్తిలో రాణిస్తా..



తల్లిదండ్రులు పద్మావతి, దక్షిణామూర్తి ప్రోత్సాహంతో హైజంప్‌లో రాణిస్తున్నా. స్నేహితుల పోత్సాహం కూడా ఉంది. భవిష్యత్తులో వైద్య వృత్తిలో రాణించేందుకు కృషి చేస్తా.

- ఎ.దేవకీ ప్రియాంక, 9వ తరగతి

అండర్ -17 విభాగంలో..

స్పోర్ట్స్‌కోటాలో ఉద్యోగం సాధిస్తా..



షాట్‌పుట్‌లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు సాధన చేస్తున్నా.. తండ్రి దాడియ్య, తల్లి నాగమణి ప్రోత్సాహంతో క్రీడాకారిణిగా రాణిస్తున్నా.. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా..

- ఉల్లిబోయిన మేరీ ప్రియాంక, 10వ తరగతి

ఐపీఎస్.. నా కల..



చిన్నప్పటి నుంచి పరుగులో ఉత్తమ ఫలితాలు సాధించడంతో హెచ్‌ఎం, పీఈడీ, తల్లి దండ్రులు సుబ్బారావు, గోణాలమ్మ ప్రోత్సాహం ఉంది. ఐపీఎస్‌గా ఎంపికై సేవ చేస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకువస్తా.

- మన్యం ఆంజనేయస్వామి, 10వ తరగతి

రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి ఇద్దరు బాలికలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భీమవరంలో ఈనెల 21న జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) జిల్లా స్థాయి చదరంగం పోటీ అండర్-14 విభాగంలో ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని స్కూలు హెచ్‌ఎం సిస్టర్ కె.శాంతమ్మ, వ్యాయామోపాధ్యాయురాలు వై. మురళీకృష్ణమ్మ తెలిపారు. పాఠశాలలో 8, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థినులు పచ్చల బాబీబాల, పచ్చల సుచిత్ర క్రిస్టీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. ఈ విజయంతో ఈనెల 29నుంచి 31 వరకు అనంతపురం జిల్లా హిందూపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి చెస్‌టోర్నీలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తరఫున పాల్గొంటారన్నారు.



విజేతలతో స్కూల్ హెచ్‌ఎం, పీఈటీ



ఇద్రీస్‌ను అభినందిస్తున్న స్కూలు హెచ్‌ఎం, పీఈటీ

కబడ్డీ జట్టుకు ఇద్రీస్ ఎంపిక

ఏలూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ టీం అండర్-14 విభాగం బాలుర జట్టు ఎంపిక పోటీలో స్థానిక మౌలానా అబుల్ కలాం అజాద్ మున్సిపల్ ఉర్దూ హైస్కూలు విద్యార్థి ఎస్కే.ఇద్రీస్ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు అర్హత సాధించాడని స్కూలు హెచ్‌ఎం ఖాజీదా బేగం తెలిపారు. ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో భాగంగా ఏలూరు ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చాడని, నవంబరులో బాపట్లలో జరుగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ అండర్-14 ఉమ్మడి జిల్లా జట్టుకు ఇద్రీస్ ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. విద్యార్థినిని స్కూలు వ్యాయామాపాధ్యాయుడు శ్రీనివాసకుమార్, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.డి. అజీమ్, ఉపాధ్యాయులు అభినందించారు.



గోపీనాథపట్నంలో మత్స్య అధికారులతో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి

ఆక్వా ఎగుమతుల్లో రాష్ట్రానికి ప్రథమ స్థానం

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

ఉంగుటూరు, అక్టోబరు 26: ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో జాతీయ స్థాయిలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉన్నదని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి తెలిపారు. శనివారం గోపీనాథపట్నంలో మత్స్యశాఖ ఏర్పాటు చేసిన ఆక్వా ఎగ్జిబిషన్‌ను శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక మత్స్య రైతులతో మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా అభివృద్ధికి అనువైన పరిస్థితులు ఉన్నాయన్నారు. త్రిపుర రాష్ట్రానికి కూడా ఈ ప్రాంతం నుంచి ప్రతి రోజూ 20 లారీల వరకు ఆక్వా ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలోని భూములు ఆక్వా పరిశ్రమ అభివృద్ధికి ఎంతో అనుకూలమన్నారు. ఈ ప్రాంతంలో త్రిపుర రైతులు సాగు విధానంపై ఆధ్యయనం చేసి అనేక అంశాలపై ఆక్వా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ 11.93 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తులతో ఏలూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందన్నారు.

త్రిపుర రాష్ట్ర గవర్నర్‌కు స్వాగతం

భీమవరం ఎడ్యుకేషన్: త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పశ్చిమ గోదావరి జిల్లాలో శని, ఆదివారాల్లో పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు తొలుత శనివారం భారతీయ విద్యాభవన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. తదుపరి గవర్నర్ పోలీస్ వందనాన్ని స్వీకరించారు.

పాలకోడేరు: పురిగళ్ళ రాధాకృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ పురిగళ్ళ రఘురామ్ ఆధ్వర్యంలో పేదవారికి సహాయసహకారాలు అందించటం అభినందనీయమని త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. విస్సాకోడేరులో ట్రస్టు ఆధ్వర్యంలో గవర్నర్ చేతుల మీదుగా ప్రజలకు కుట్టుమిషన్లు ఆయన చేతుల మీదుగా అందించారు.

భీమవరం టౌన్: హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామిని త్రిపుర రాష్ట్ర గవర్నర్ శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు.

పేలుతున్న టపాసుల ధరలు



- బయట మార్కెట్‌లో మోగుతున్న మోత
- హోల్‌సేల్, డీసీఎంఎస్‌లలో భారీగా అమ్మకాలు

ఏలూరుసిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దీపావళి వచ్చేస్తోంది. బాణసంచా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం హోల్‌సేల్ షాపుల్లోనే అమ్మకాలు కొనసాగుతున్నాయి. ధరలు పేలుతున్నాయి. ఏలూరులోని డీసీఎం ఎస్ బాణసంచా దుకాణం వినియోగదారులను విశేషంగా ఆకర్షిస్తోంది. 80శాతం డిస్కౌంట్‌తో అమ్మకాలు చేస్తున్నారు. వట్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో గల ఒక ప్రైవేటు రైస్‌మిల్‌లో బాణసంచా దుకాణాన్ని ఈనెల 19వ తేదీన డీసీఎంఎస్ ఏర్పాటు చేసింది. ఈ సారి గ్రామాలు, పట్టణాల్లో రిటైల్ బాణసంచా దుకాణాలు తెరవలేదు. తాత్కాలిక లైసెన్సులు కావటంతో మూడురోజులే దీపావళి బాణసంచా వ్యాపారం కొనసాగుతుంది. అయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో హోల్‌సేల్ దుకాణాల్లో మాత్రం బాణసంచా విక్రయాలు ప్రారంభమయ్యాయి.

పేలుతున్న ధరలు

గతంతో పోలిస్తే ఈ సారి బాణసంచా సరుకుల ధరలు కొంత పెరిగాయని చెప్పవచ్చు. కాకర పువ్వొత్తులు ఒక పెట్టె రూ.25 నుంచి మొదలవుతోంది. భూచక్రాలు ఒక పెట్టె గతంలో రూ.112 ఉండగా ఇప్పుడు రూ.120 ఉన్నది. విష్ణు చక్రాలు 150 నుంచి 300 రూపాయలు, కంపెనీ చిచ్చుబుడ్లు 180 నుంచి 580 రూపాయలు వరకు ధరలు పలుకుతున్నాయి. కుండ చిచ్చుబుడ్లు ఒక్కటి రూ.30, తాళ్ళ పెట్టె 80 నుంచి 160 రూపాయలు, వెన్నముద్దలు/పెన్సిల్స్ రూ.40 నుంచి 150 వరకు, ఔట్లు ప్యాకెట్ ఒక్కింటికి 35 నుంచి 46 రూపాయలు, సీమటపాకాయలు ప్యాకెట్ రూ.80 నుంచి 115 వరకు ధరలు ఉన్నాయి. ఇక సీమటపాకాయల తోరణాలు రూ.700 నుంచి 6200 వరకు, బాంబుల ప్యాకెట్లు రూ.135 నుంచి 170 వరకు, ర్యాకెట్లు ప్యాకెట్‌లు రూ.170 నుంచి 295 వరకు ధరలున్నాయి. ఇక అందరికీ అనుకూలంగా అన్ని బాణసంచా సరుకులు ఉండే గిఫ్ట్ బాక్సులు రూ.600 నుంచి 4750 వరకు ధరలు పలుకుతున్నాయి.

అధిక ధరలు, అక్రమ నిల్వలపై చర్యలు



సూర్యప్రకాశరావు (అసిస్టెంట్ డిస్ట్రిక్టు ఫైర్ ఆఫీసర్, భీమవరం)

బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నవారు అధిక ధరలకు విక్రయిస్తే గుర్తించి సంబంధిత అధికారులు (సేల్స్ ట్యాక్స్) తెలియజేస్తాం. దీనిపై పూర్తిస్థాయి నిఘా ఉంటుంది. అలాగే ఎవరైనా నిబంధనలు అతిక్రమించి అక్రమంగా బాణసంచా నిల్వలు చేసినా పోలీస్‌శాఖ ద్వారా చర్యలు తీసుకుంటాం. దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. లేనిపక్షంలో వారికి ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తాం.

నిబంధనలు తప్పనిసరి

భీమవరం క్రైం: బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. దుకాణం ఏర్పాటు చేసుకోవాలంటే ముందుగా ఆర్డీవో కార్యాలయం నుంచి అనుమతులు ఉండాలి. అనంతరం పోలీస్ శాఖ, తహసీల్దార్, అగ్నిమాపక కార్యాలయం అనమతులు తీసుకోవాలి. అగ్నిమాపకశాఖ అనుమతులు కోసం 500 రూపాయలు చలనా చెల్లించి చెక్‌లిస్ట్‌పై సంతకాలు పెట్టి దరఖస్తును అందజేస్తే అధికారులు అనుమతులు ఇస్తారు. నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) తీసుకుని ఆర్డీవో కార్యాలయానికి వెళ్తే అక్కడ పూర్తిస్థాయి అనుమతులు తీసుకుని దుకాణం ఏర్పాటు చేసుకోవాలి. అక్కడ ఎన్ని రోజులు దుకాణం ఏర్పాటు చేస్తారో కూడా తెలియజెయ్యాలి.

షాపుల వద్ద నిబంధనలు

- దుకాణం ఏర్పాటుకు తప్పనిసరిగా రేకుల షెడ్డు ఏర్పాటు చెయ్యాలి.
- మైనర్‌లు దుకాణాల్లో ఉండకూడదు.
- దీపాలు, సిగరెట్లు వెలిగించకూడదు.
- 200 లీటర్ల వాటర్ డ్రమ్ము షాపు దగ్గర ఉంచాలి.
- రెండు ఇసుక బకెట్లు ఉంచుకోవాలి.
- దుకాణానికి దుకాణానికి 3 మీటర్లు దూరం ఉండేలా చూడాలి.
- విద్యుత్ లైట్లు కోసం ఏర్పాటు చేసే వైర్లకు లూజు కనెక్షన్ ఉండకూడదు.

దుకాణాలు ఎక్కడ ఏర్పాటు చేయాలి

జన సంచారం లేని ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. ఖాళీ గ్రౌండ్‌లు, గ్రామాలు, పట్టణాలకు దూరంగా దుకాణాలు ఉండాలి. అలాగే పార్కింగ్ కూడా దుకాణాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి.

మోటార్ సైక్లిస్టు మృతి

ఉంగుటూరు, అక్టోబరు 26: జాతీయ రహదారిపై బాదంపూడి వై జంక్షన్ వద్ద శనివారం నాడు రోడ్డు ప్రమాదం జరిగింది. ఉంగుటూరు నుంచి బాదంపూడి ఊరులోకి వెళుతున్న మోటారు సైకిల్‌ను తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళుతున్న కారు ఢీకొనగా బాదంపూడికి చెందిన మోటారు సైక్లిస్టు కోడి విచిత్రరాజు(35) మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

40 కేజీల గంజాయి స్వాధీనం

పెనుగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్టేరు పెనుగొండ రోడ్డులో శనివారం సాయంత్రం గంజాయితో వెళుతున్న వాహనాన్ని పట్టుకున్నారు. పెనుగొండ ఎస్‌ఐ కె.గంగాధరరావుకు వచ్చిన సమాచారం మేరకు డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, వీఆర్‌వో కలిసి కర్ణాటక రాష్ట్రానికి చెందిన లారీలో ఉన్న సుమారు 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని లారీ డ్రైవర్ ప్రసన్న, క్లీనర్ శ్రీకాంత్‌లను అరెస్టు చేశారు.

రైళ్లలో దొంగ అరెస్టు

రూ.51వేల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

భీమవరం క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నడుస్తున్న రైళ్ళే అతని టార్గెట్. ఒక స్టేషన్‌లో ఎక్కి తన పనిని చాకచక్యంగా పూర్తి చేసుకుని తరువాత వచ్చే రైల్వేస్టేషన్‌లో దిగిపోతాడు. కొట్టేసిన సొమ్ముతో జల్సా చేసి ఆ సొమ్ము అయిపోయాక మళ్ళీ మరో రైలును ఎంచుకుంటాడు. అలాంటి రైళ్లలో దొంగను భీమవరం రైల్వే పోలీసులు శనివారం అరెస్టు చేసి వివరాలను తెలియజేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉడిమడి గ్రామానికి చెందిన ఇసుకపల్లి ప్రసన్న బాబు ప్రస్తుతం గుంటూరులో ఉంటున్నాడు. చెడు అలవాట్లకు బానిసైన ప్రసన్నకుమార్ గతంలో కూడా మహిళల హ్యాండ్ బ్యాగ్‌ల చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ప్రసన్నకుమార్ కోసం గాలిస్తుండగా శనివారం నాడు జంక్షన్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం నెంబర్ 1పై అనుమానంగా తిరుగుతూ ఉండగా అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ పీటీవీ రమణ తెలిపారు. అతని వద్ద బంగారు ఆభరణాలు (రూ.51,000) స్వాధీనంపరుచుకుని కోర్టుకు పంపినట్లు తెలిపారు.

బస్సుపై కర్రలు, ఇనుప రాడ్లతో దాడి



బస్సును వెంబడిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుపై కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసిన ఘటన శనివారం రాత్రి జరిగింది. బస్సు డ్రైవరు ఎంఎస్. సత్యనారాయణ, కండక్టరు రవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో అశ్వారావుపేట నుం చి జంగారెడ్డిగూడెం వస్తున్న ఆర్టీసీ బస్సును జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత ఇద్దరు యువకులు పల్సర్ బైక్‌తో క్రాస్ చేసి ఆపారు. బస్సు ఆగిన తర్వాత ఇనుపరాడ్డుతో బస్సును కొట్టడం మొదలు పెట్టాడు. దీంతో భయపడిన డ్రైవరు బస్సును ముందుకు నడుపు తున్నాడు. ఒక కిలో మీటరు వెళ్ళిన తర్వాత మరో ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు బస్సును కర్రలతో కొట్టడం ప్రారంభించారు. మరి కొంత దూరం వెళ్ళాక మరో ద్వి చక్ర వాహనంపై మరో ఇద్దరు వచ్చి బస్సు కదులుతుండగా జంగారెడ్డిగూడెం వేగవరం బైపాస్ దాటేంత వరకు మూడు వాహనాలపై ఆరుగురు యువకులు బస్సును ఫాలో అవుతూ వచ్చారు. బస్సులో ప్రయాణికులు తీవ్ర భయాదోళనకు గురి కాగా కండక్టరు రవి 100 డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు జంగారెడ్డిగూడెం రాగానే పోలీసులు వివరాలు సేకరించారు. అశ్వారావు పేట నుంచి జంగారెడ్డిగూడెం వచ్చే దారిలో బస్సుపై దాడి చేసిన యువకులలో ఎవరికో ఒకరికి బస్సు తగిలి ఉంటుందని ఆ కోపంతో ఇలా చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

క్రైమ్ కార్నర్

అదనపు కట్నం కేసు

భీమవరం క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం అత్త, మామలు వేధిస్తున్నారంటూ భీమవరం పట్టణం 8వ వార్డుకు చెందిన గోళ్ళ షారూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ చెప్పారు. షారూన్‌కు 2017లో కాళ్ళ మండలం బొండాడపేటకు చెందిన గోళ్ళ కేదారేశ్వరరావుతో వివాహం అయ్యింది. భర్త, అత్తమామలు కోరిక మేరకు రూ.10లక్షలు కట్నంగా ఇచ్చారు. తరువాత వ్యవసాయ పెట్టుబడులకు సొమ్ములు కావాలంటూ అదనపు కట్నం తేవాలంటూ డిమాండ్ చేయడంతో 16 కాసుల బంగారం అమ్మి సొమ్ములు ఇచ్చారు. తరువాత మరో 10 లక్షలు సొమ్ములు తేవాలంటూ వేధిస్తూన్నారంటూ షారూన్ ఈనెల 25వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందున్న వ్యక్తి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ యెషయా తెలిపిన వివరాలు ప్రకారం.. ఎన్‌ఆర్‌పీ అగ్రహారంనకు చెందిన ముబారా షీర్ (35) ఆర్థిక ఇంబ్బందులు వలన ఈనెల 14న ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. దీనిని గమనించిన స్థానికులు ఆయన్ని భీమవరం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ శనివారం మృతిచెందారు.

గోదావరి బ్రిడ్జిపై యువకుడి అదృశ్యం

యలమంచిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కత్తిమండ గ్రామానికి చెందిన పెచ్చెట్టి ఏసురాజు కనిపించడం లేదని అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చించినాడ బ్రిడ్జిపై చెప్పులు, ఫోన్ నంబరు రాసి ఉన్న కాగితం ఉండటాన్ని గమనించిన ఒక వ్యక్తి ఆ ఫోన్ నంబరుకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఫోన్ రిసీవ్ చేసుకున్న ఏసురాజు తండ్రి రాము వెంటనే చించినాడ బ్రిడ్జి వద్దకు చేరుకుని చూడగా అక్కడ ఉన్న చెప్పులు తన కుమారుడివని నిర్ధారించుకున్నారు. దీంతో యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసునమోదు చేసి ఏసురాజు గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. లేక చెప్పులు, కాగితం బ్రిడ్జిపై వదిలి ఎక్కడికైనా వెళ్లాడా అనే అంశాలతో దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసపురం గ్రామానికి చెందిన కొమ్ముకూరి బోడియ్యకు చెందిన ద్విచక్ర వాహనం ఈ నెల 21న తన ఇంటి వద్ద పార్కు చేసిన సుజుకీ యాక్సెస్ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ మేరకు శనివారం ఫిర్యాదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెదపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపూరు డంపింగ్‌యార్డు వద్ద ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బ్రిడ్జి పైనుంచి కారు పల్టీ

కుక్కునూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు, భద్రాచలం రహదారి మార్గం ప్రమాదకరంగా మారింది. వారం రోజుల వ్యవధిలో మూడు ప్రమాదాలు జరిగాయి. శనివారం పురుగు మందుల కంపెనీలో పని చేస్తున్న నాగిరెడ్డి అనే వ్యక్తి రాజీవ్‌నగర్, అమరవరం గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ బ్రిడ్జి వద్ద కారు ప్రమాదానికి గురైంది. బ్రిడ్జి పై నుంచి కారు మూడుపల్టీలు కొట్టి వాగులో పడింది. ఈ ప్రమాదంలో నాగిరెడ్డి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. రహదారి విస్తరణ పనులు జరుగుతున్న క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గేదెల కోసం వెళ్లి దంపతుల మృతి



రాంబాబు, ప్రశాంతి మృతదేహాలు

నూజివీడు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చెరువులో దిగిన గేదెలను బయటకు తోలుకొచ్చేందుకు చెరువులో దిగిన భార్య భర్తలు మృత్యువాత పడిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొండా రాంబాబు(45), ప్రశాంతి(35)లు పాడి జీవనాధారంగా చేసుకున్నారు. ఈక్రమంలో పాడి గేదెలను పోతిరెడ్డిపల్లి కురివిడి చెరువు సమీపానికి తోలుకెళ్లగా చెరువులోకి దిగిన పాడి గేదెలను బయటకు తోలేందుకు రాంబాబు - ప్రశాంతిలు చెరువులోకి దిగారు. అయితే చెరువు లోతుగా ఉండటంతో వారివురు మునిగిపోయారు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గుంటూరు ఏరియా ఆసుపత్రికి తరలించి రూరల్ ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దంపతుల మృతి సమాచారం తెలుసుకున్న రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి సానుభూతి తెలిపారు. మంత్రి ప్రభుత్వ యంత్రాంగాన్ని సంఘటనా స్థలానికి పంపి సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు.

యాప్ పేరుతో బురిడీ



డబ్బులు చెల్లించిన బాధితులు.. అకౌంట్‌లో డబ్బులు పడక లబోదిబో.. రూ.కోట్లలో నష్టం

భీమవరం క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలోనే అధిక మొత్తంలో చెల్లిస్తామంటూ ప్రజలను సైబర్ మోసగాళ్ళు బురిడీ కొట్టించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాధితులు అధికంగా ఉన్నారు. వాళ్ళు ఇప్పుడు ఒక్కొక్కరుగా బయట కొస్తున్నారు. సైబర్ పోలీసులకు ఆశ్రయించడానికి సిద్ధమయ్యారు. బ్యాంక్ ఖాతాలు, చరవాణి నెంబర్లు, ఆధార్‌కార్డు సమాచారమంతా ఆ యాప్‌లో ఉంచడంతో ఖాతాల్లో నగదు ఎప్పుడైనా జమ చేస్తే లాగేస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు.

వందలాదిగా బాధితులు

బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ యాప్‌ను పరిచయం చేశారు. భీమవరంలో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఆశ చూపారు. ఇది నిజమని నమ్మినవాళ్ళంతా వారితో పాటు బంధువులతో కూడా నగదు జమ చేయించారు. ఇంతకీ నగదు అంతా ఎలాంటి పూర్తి వివరాలు లేని యాప్‌లో ఉంచారు. అందులో కొన్ని విభాగాలు ఉన్నాయి. ఒక్కో విభాగంలో రూ.6వేలు, రూ.18వేలు, రూ.20వేలు ఇలా నగదు చేసినవారికి ప్రతీరోజు ఇచ్చిన టాస్కులు పూర్తి చేయడంతో విభాగానికి తగ్గట్లుగా నగదు వారి ఖాతాలో జమ చేశారు. ఇదంతా చూస్తే రోజుకు రూ.750 వరకు ఖాతాలో నగదు సంబంధిత యాప్ నుంచి జమ అయ్యేది. కొన్ని రోజుల పాటు జమ అయిన తరువాత నగదు డ్రా చేసుకున్నారు. ఈవిధంగా ప్రజల్లో నమ్మకాన్ని కలిగించారు. దీంతో ఒక్కో విభాగంలో 500 నుంచి 600 మంది సభ్యులుగా చేర్చారు. ఒక్కొక్కరు రూ.20వేలుకు పైగా జమ చేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా వందలాది బాధితులు నగదు జమ చేసి సైబర్ వలలో చిక్కుకున్నారు. ఇటీవల కాలంలో టాస్కులు పూర్తి చేసినా నగదు బ్యాంక్ ఖాతా నుంచి డ్రా కావడం లేదు. రెండు రోజులు, నాలుగు రోజుల్లో నగదు చేతికి వస్తాయంటూ బాధితులను ఇప్పటి వరకు మభ్యపెట్టారు. చాలా మందికి అనుమానం వచ్చి నగదు లావాదేవీ నిలిపివేయడంతో యాప్‌ను మళ్ళీ పునరుద్ధరించామంటూ రూ.6వేలు ఒకేసారి జమచేస్తే మీరు గతంలో చెల్లించిన నగదు కూడా తిరిగి వస్తుందని చెబుతున్నా ప్రజలు నమ్మడం లేదు. భీమవరంలో గతంలో సమావేశం నిర్వహించిన వారి వివరాలు కోసం వెతుకుతున్నారు. బాధితులంతా సమావేశమై పోలీసులను ఆశ్రయించే యోచనలో ఉన్నారు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో అనేక మంది ఈ యాప్ బారిన పడ్డారు. ఈ క్రమంలో గ్రామంలో అనేక మంది కోటి రూపాయల మేర చెల్లించారు. రెండు నెలలుగా జరుగుతున్న ఈ పథకంలో కొంత మంది నాలుగు వారాల పాటు బాగానే విత్‌డ్రాలు జరిగాయి. అయితే రెండు వారాల నుంచి అకౌంట్లలో పడిన సొమ్ము విత్ డ్రా కాకపోవడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. ఎవరిని అడగాలి అనే మీమాంసలో ఉండి పోయారు. టెక్నికల్ సమస్య వచ్చిందని, అలాగే ఫైనాన్సియల్‌గా ఇబ్బంది వచ్చిందని ఉదయం 9.30 గంటల నుంచి రెండున్నర గంటలపాటు వేచి చూడాలని మెసేజ్‌లు వచ్చాయి. తాము మోసపోయామని బాధితులు లబోదిబో అంటున్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

బాలలు భవిష్యత్ నిర్దేశకులు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

భీమవరం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల హక్కుల గురించి తెలియజెప్పడంలో ప్రతి ఒక్కరు కీలక పాత్ర పోషించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ అన్నారు. శనివారం భీమవరం డీఎన్నార్ కాలేజీ సమావేశం హాలులో ది రైట్ ఆఫ్ ది చిల్డ్రన్ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ నల్సా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలలు భవిష్యత్‌కు నిర్దేశికులుగా ఉంటారన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ బాలల వికాసం ఎంతో అవసరమని, ఆరోగ్యకరమైన వాతావరణంలో వారి సంరక్షణ ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ హోటల్స్, ఇటుక బట్టీలు, గృహాలలో బాల కార్మికులుగా ఎవరూ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ కం సివిల్ జడ్జి కె రత్నప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై యోహాన్ న్యూటన్, పోక్సో ఏడీజే సోమశేఖర్, పోర్ ఏడీజే డి సత్యవతి, టెన్త్ ఏడీజే విజయదుర్గ పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్య శిక్షణపై ఒప్పందం



నూజివీడు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నైపుణ్యం పెంచే దిశగా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ హైదరాబాద్‌కు చెందిన టీటీఎస్ ఇండస్ట్రియల్ సొల్యూషన్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. దీంతో మెటలర్జీ, ఇతర ఇంజనీరింగ్ విద్యార్థులు అధునాతన యంత్రాలను పరిశ్రమల స్థాయిలో వినియోగించుకునేందుకు, శిక్షణ పొందేందుకు వీలు కలుగుతుందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. కంపెనీ డైరెక్టర్ వెంకట రెడ్డి, హెచ్‌వోడీ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



చదువుతో పాటు దేశభక్తి ఉండాలి

పెంటపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని అలవర్చుకోవాలని 1971 వార్ హీరో విశ్రాంత స్క్వాడ్రన్ లీడర్ పుష్ప్ వైద్ అన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ డిఫెన్స్ అకాడమి(ఎన్‌డీఏ) ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పుష్ప్ వైద్ మాట్లాడుతూ టీబీఆర్ డిఫెన్స్ అకాడమి విద్యార్థులు భారత సైనిక దళంలో సేవలందించాలని ఆకాంక్షించారు. టీబీఆర్ చైర్మన్ తనుబుద్ది భోగేశ్వరరావు మాట్లాడుతూ 1971 భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన భీకర యుద్ధంలో భారత దేశం విజయం సాధించడానికి ముఖ్య భూమిక పోషించిన వారిలో పుష్ప్ వైద్ కూడా ఒకరన్నారు. ప్రస్తుతం స్కాట్‌లాండ్‌లో ఉంటున్న పుష్ప్‌వైద్ అక్కడి నుంచి వచ్చి టీబీఆర్ డిఫెన్స్ అకాడమిని సందర్శించడం గర్వించదగ్గ విషయమన్నారు. తొలుత ప్రాగణంలో ఉన్న సైనిక యుద్ధవీరుని విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం పుష్ప్ వైద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, హెచ్‌ఎం కళ్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.


జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

అమలాపురానికి ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసు ప్రారంభం

భీమవరంటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నూతన సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని ఆర్టీసీని ఆదరించాలని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమవరం నుంచి అమలాపురం వరకు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సును ఆయన భీమవరం ఆర్టీసి బస్టాండ్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీసి డిపో మేనేజర్ సత్య నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ప్రాణాలు లెక్కచేయని పోలీసులు'

భీమవరం క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌లు విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్క చేయరని, రేయింబవళ్లు ప్రజా రక్షణలోనే ఉంటారని ఒకటో పట్టణ సిఐ నాగ రాజు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, భీమవరం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సిఎస్ఎన్ కళాశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోలీస్‌శాఖ అధికారుల ప్రకారం వారి అంశంపై రెండు కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని, ముగింపు రోజున బహుమతులు అందిస్తామని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. కళాశాల కోశాధికారి వడుపు గోపి, అల్లు రామకృష్ణ, అల్లు వనజాక్షి, జి గణపతి, గెడ్డం భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

తణుకు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు క్రీడల్లోను ఉత్సాహంగా పాల్గొనాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రానున్న ఐదేళ్ల కాలంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అవకాశాలను అందిపుచ్చుకో వాలన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పోటీలకు తాడేపల్లిగూడెం, గణపవరం, పాలకొల్లు, భీమవరంలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్డీవో వై.భవాని, సీఈవో ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ యు.లక్ష్మీ సుందరీ బాయ్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనాసాయి పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించిన విద్యార్థులు

కాళ్ళ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కలవపూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు శనివారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా ఆక్వా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించినట్టు హెచ్ఎం సీతారామమూర్తి తెలిపారు. ఏలూరుపాడు పరిధిలోని రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించినట్టు వివరించారు.

కార్మికులకు కిట్స్ అందజేత

భీమవరం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సఫాయీ కర్మచారి ఫైనాన్షియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి ద్వారా నమస్తే కార్యక్రమంలో భాగంగా మునిసిపాల్టీ పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పనులలో పాల్గొనే వారిని గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి వారిలో అర్హులకు శనివారం సాయంత్రం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు.

నేడు ఆర్చ్ ప్రారంభం

ఉండి అక్టోబరు 26(ఆంధ్యజ్యోతి): ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృషరాజు చేతుల మీదుగా ఉండి కొత్తపేటలో దాత నిర్మించిన ఆర్చ్‌ను ఎమ్మెల్యే రఘురామరాజు ఉదయం 9.30కు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం ఉదయం 10.30 గంటలకు ఉండి మండలం పెదపుల్లేరులోని సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఫుడ్ ఫెస్టివల్‌లో ఘుమఘుమలు

నరసాపురం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సన్‌షైన్ విద్యా సంస్థల్లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు తమ వంటకాలతో ఘుమఘుమలాడించారు. వాటిని స్టాల్స్‌లో పెట్టి విక్రయించారు. సందర్శకులకు ఏ విధంగా తయారు చేశామో వివరించారు. ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ ప్రదీప్ కుమార్ ఫెస్టివల్‌ను ప్రారంభించి మాట్లాడుతూ చదువు, క్రీడలతో పాటు వంటకాల్లో కూడా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. స్కూల్ ఫౌండర్ జయప్రసాద్, పెద్దిరాజు పాల్గొన్నారు.



చినవెంకన్న అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాళ్ళ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన వెంకన్న శాశ్వత అన్నదాన పథకానికి కాళ్ళ గ్రామస్తుడు గోళ్ళ నాగేశ్వరరావు కుటుంబీకులు రూ.1,00,000 విరాళాన్ని అందజేసినట్టు విలేకరులకు తెలిపారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి బాండ్ అందించారని తెలిపారు.


శాశ్వత సభ్యత్వం తీసుకున్న రఘురామకృష్ణరాజు, రామరాజు





తణుకులో సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న ఆరిమిల్లి.. తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జి.. పాలకొల్లు మండలంలో, ఆచంట టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు

టీడీపీ సభ్యత్వం అంటే భరోసా

▸ కోలాహలంగా టీడీపీ సభ్యత్వాల నమోదు ▸ ఉండి నియోజకవర్గంలో తొలిరోజు 10 శాశ్వత సభ్యత్వాల నమోదు

కాళ్ళ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్యకర్తలకు అండగా ఉంటుందని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఏపీఐఐసి చైర్మన్ మంతెన రామరాజులు అన్నారు. కాళ్ళ మండలం పెదఅమిరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ఏర్పాటు చేయటం, అదేవిధంగా మట్టిఖర్చుల కింద రూ.10వేలు తక్షణ సహాయం అందించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్యకర్తలు చురుగ్గా పాల్గొని పార్టీ అభిమానులందరూ సభ్యత్వం తీసుకునేలా చూడాలన్నారు. అనంతరం జిల్లాలో తొలి శాశ్వత సభ్యత్వంను ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, రెండో శాశ్వత సభ్యత్వంను జిల్లా అధ్యక్షుడు హోదాలో తాను తీసుకున్నట్లు రామరాజు తెలిపారు. వీరితో పాటు మరో ఎనిమిది మంది శాశ్వత సభ్యత్వంను తీసుకున్నారు. అనంతరం రూ.లక్ష రూపాయలు అందుకుని శాశ్వత సభ్యత్వంను ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకి రామరాజు అందజేశారు. టీడీపీ కాళ్ళ, ఆకివీడు, ఉండి మండలాధ్యక్షులు జీవి నాగేశ్వరరావు, మోటుపల్లి రామవరప్రసాద్, కరిమెరక నాగరాజు, నాయకులు తోట ఫణిబాబు, ఆరేటి వెంకటరత్నప్రసాద్, వీరవల్లి శ్రీనివాసరావు, కట్రెడ్డి శ్రీనివాసరావు, సాగిరాజు హరివర్మ, దంతులూరి శ్రీనివాసరాజు, కొత్తపల్లి నాగరాజు, తోట శ్రీరాములు, మంతెన పెదనరసింహరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: టీడీపీ సభ్యత్వం రూ.100తో తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయల పరిహారం, మరణించిన రోజే 10 వేలు మట్టిఖర్చులు కింద చెల్లిస్తామని టీడీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తెలిపారు. భీమవరం 6 వార్డు బొక్కవారిపాలెంలో సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వీరవాసరం మండలం నేలపోగుల, భీమవరం మండలం దిరుసుమర్రు, భీమవరం బొక్కవారిపాలెంలో సభ్యత్వ సేకరణలో పాల్గొన్న భీమవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడుకు రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ నియోజక వర్గంలో రికార్డు సృష్టించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వీరవాసరం మండలం నేలపోగులలో రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, దిరుసుమర్రులో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు.


కంచుస్తంభంపాలెంలో సభ్యత్వ నమోదు

తణుకు: టీడీపీ సభ్యత్వం అంటేనే కార్యకర్తలకు భరోసా కల్పించేదని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ముందుగా లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని ఆరిమిల్లి నమోదు చేసుకున్నారు. గతంలో దానికి భిన్నంగా వంద రూపాయలు సభ్యత్వం అని ఐదులక్షల బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని, దానితో పాటు టీడీపీ గౌరవం కల్పించే విధంగా కార్యకర్తలకు అండగా ఉండే విధంగా శాశ్వత సభ్యత్వం లక్ష చెల్లించి జీవిత కాలం సభ్యత్వం పొందే అవకాశం కల్పించారని తెలిపారు. కార్యకర్తలు ఇబ్బందులు అధిగమించేందుకుముఖ్యంగా పిల్లలు చదువులకు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా స్కిల్ ట్రైనింగ్ ఇచ్చి దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేయాలన్నారు.


ఆన్‌లైన్‌లో సభ్యత్వం తీసుకున్న బందారు

తాడేపల్లిగూడెం అర్బన్: టీడీపీ సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున చేయించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడుతూ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను పార్టీ శ్రేణులంతా ప్రజలకు వివరించాలన్నారు. పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, బండి పెద్దిరాజు, పి. మురళి, రాం లక్ష్మణ్, ఆకాశపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: టీడీపీ సభ్యత్వాలు నమోదుతో కార్యకర్తల సంక్షేమానికి భరోసా ఏర్పడుతుందని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. శనివారం పాలకొల్లులో ఆన్‌లైన్ ద్వారా టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ గతంలో తీసుకున్న సభ్యత్వాలను రెన్యువల్ చేయించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యకురాలు రోజారమణి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వం అందిస్తున్న పొత్తూరి, సాయి

నరసాపురం: టీడీపీ సభ్యత్వ నమోదు శనివారం కోలాహలంగా సాగింది. తొలిరోజు మండలంలోని గొంది, పట్టణంలోని లాకుపేట, మొగల్తూరు మండలంలో ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, పరిశీలకులుగా విచ్చేసిన సాయి ప్రారంభించారు. పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చారు. కొత్తగా సభ్యత్వం లేని వారంతా పేర్లను నమోదు చేయించుకున్నారు. పాత కార్డులు ఉన్నవారు రెన్యువల్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రామరాజు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వానికి నియోజక వర్గంలో అనూహ్య స్పందన కనిపించిందన్నారు. స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. తొలి రోజున ఆయన రాయపేటలోని తన నివాసం నుంచి ఆన్‌లైన్‌లో పార్టీ సభ్యత్వాన్ని తీసుకుని మాట్లాడారు. కార్యకర్తలకు అనేక ప్రయోజనాలు చేకూర్చే పార్టీ టీడీపీ అన్నారు. ప్రజలకు మేలు చేసే పార్టీని గుర్తించి సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.

పాలకొల్లు రూరల్: సభ్యత్వాల నమోదులో పాలకొల్లు నియోజకవర్గం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేద్దామని టీడీపీ పాలకొల్లు మండల నాయకులు పేర్కొన్నారు. మండలంలో సభ్యత్వ నమోదును పార్టీ నాయకులు ప్రారంభించారు. కోడి విజయభాస్కర్, పాముల రజనీకుమార్, ఇంటి శ్రీరాముడు, కె.అయ్యప్ప నాయుడు, దిడ్ల రామాంజ నేయులు, పెనుమత్స సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు శనివారం ఆచంటలోని టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నాయకులు ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి అనంతరం సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు కేతా మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: వంద రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల ప్రమాద బీమాతో పాటూ విద్య, వైద్యం, ఉపాధి సహాయం అందిస్తున్న ఏకైక పార్టీ టీడీపీ అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనం నాని అన్నారు. కంచు స్తంభంపాలెం, బాడవ గ్రామాల్లో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ముచ్చర్ల శ్రీనివాస్, రుద్రరాజు సత్యనారాయణరాజు, రాయి శ్రీనివాస్, పీతల శ్రీను, బొప్పన హరికిషోర్, గుబ్బల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూళ్లలో రోబోల ఏర్పాటు : రఘురామ

ఉండి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఉండి, పాలకోడేరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో రోబోలను ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు వెల్లడించారు. శనివారం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు అధ్యక్షతన జరిగిన ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉండి పాఠశాల తదుపరి పాలకోడేరు హైస్కూల్‌లో రోబోలను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. మండల పరిషత్ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తన దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం తీసుకు రావాలని సూచించారు. సాగునీటికి ఇబ్బంది పడకుండా పంటకాలువలు, డ్రెయిన్లు, రోడ్లు ఆక్రమణలు ఉంటే తక్షణమే తొలగించాలని అధికారులకు సూచించారు. పలువురు అధికారులు మాట్లాడారు. ఎమ్మెల్యేను ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో రవీంద్ర, వైస్ ఎంపీపీ సుజాతరాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


విద్యార్థులతో కోఆర్డినేటర్ శ్యాంసుందర్

విద్యాప్రవేశ్ 90 రోజుల ప్రోగ్రాం ఆకస్మిక తనిఖీ

పాలకొల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణ పరిధిలోని జీవీఎస్‌వీఆర్ఎం పాఠశాలను జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యాప్రవేశ్ కార్యక్రమ ప్రగతిపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించిన అనంతరం ఆయన విద్యాప్రవేశ్ కృత్యాలను, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్‌ను పరిశీలించారు. విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. హెచ్ఎం భవానిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు నమోదు చేయండి

అత్తిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నిమిత్తం ఓటర్ల జాబితా తయారీపై తహసీల్దార్ దశిక వంశీ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సాగు రైతుల వివరాలను నమోదు చేసి ఓటర్ల జాబితా తయారు చేయాలని వీఆర్‌వోలను ఆదేశించారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

అత్తిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నేతృత్వంలో ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో బల్లిపాడులో డాక్టర్ దండు పద్మావతి సౌజన్యంతో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా హోమియో మందులు అందించారు. ఐదుగురు వైద్య బృందం సేవలు అందించారు. పీఠం ట్రస్టు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జ్వరాల సర్వే

పాలకోడేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థుల నుంచి పిర్యాదులొస్తున్న నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని అన్నారు. మొగల్లు గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా లేవంటూ తద్వారా అంటువ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామానికి చెందిన కే.క్రాంతిబాబు ఉన్నతాధికారులకు పిర్యాదు చేయడంతో వారి ఆదేశానుసారం 2వ రోజైన శనివారం కూడా వైద్య సిబ్బంది గ్రామంలో సర్వే నిర్వహించారు. సర్పంచ్ కృష్ణకుమారి శ్రీనివాస్‌కు పరిసరాలను పరిశుభ్రపరచాలని దోమల మందు పిచికారీ చేయాలని తెలియజేయడంతో పంచాయతీ సిబ్బంది దోమల మందును గ్రామంలో పిచికారీ చేయించారు.

బాల్య వివాహాలు నివారించాలి

గణపవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అడ్డేపల్లి వాసురాజు అన్నారు. శనివారం అర్ధవరం గ్రామంలో ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. అనంతరం బాల్యవివాహాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేశారు.

రాబోయేది హై పెర్ఫార్మింగ్ కంప్యూటింగ్ యుగం


మాట్లాడుతున్న ఉషాదేవి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో హై పెర్ఫార్మింగ్ కంప్యూటింగ్‌తో పనులన్నీ సరళమవుతాయని జేఎన్‌టీయు కాకినాడ కంప్యూటర్ సైన్స్ సహాయ ఆచార్యులు డాక్టర్ ఉషాదేవి పేర్కొన్నారు. పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అఖిల భారత సాంకేతిక మండలి సహకారంతో హై పెర్ఫార్మింగ్ కంప్యూటింగ్‌పై తాడేపల్లిగూడెం ఏఐ అండ్ ఎంఎల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు తదితరులు మాట్లాడారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వద్దు : జేసీ


తేతలిలో పొలాలను పరిశీలిస్తున్న జేసీ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని జేసి రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. పెదతాడేపల్లిలో శనివారం ధాన్యం కొనుగోలుపై సిబ్బందితో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారం భిస్తున్నామన్నారు. మిల్లర్ల నుంచి సంచులు అందుబాటులో ఉంచుకుని తేమశాతం యంత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆర్డీవో భవానీ శంకరి, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం సునీల్‌కుమార్, ఏడీఏ మురళీకృష్ణ, ఏవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: రైతులు ధాన్యం తరలింపు విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జేసీ అన్నారు. శనివారం తేతలిలో పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి సూచనలిచ్చారు. తహసీల్దార్ అశోక్ వర్మ, ఏవో కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

అత్తిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలని డ్వామా పీడీ కెసీహెచ్ అప్పారావు అన్నారు. ఉపాధి పథకంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలో జరిగిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ అత్తిలి మండలంలో 922 పనులకు గాను ఉపాధి కూలీలకు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 7.97 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. సామాజిక తనిఖీలలో భాగంగా ఉపాధి సిబ్బంది నుంచి రూ. 17,744 లు రికవరీకి ఆదేశించారు. విధులలో అలసత్వం వహించిన ఉపాధి సిబ్బందికి రూ.6500లు జరిమానా విధించారు. రూ. 2,67,590లతో చేపట్టిన పలు పనులకు సంబంధించి విచారణ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, పూతినీడి శ్రీనివాస్, జిల్లా అంబుడ్స్‌మెన్ అధికారి ఆదినారాయణ, జిల్లా విజిలెన్స్ అధికారి కె. పురుషోత్తం, ఎంపీడీవో శామ్యూల్, ఎస్ఆర్‌పీ ఎం గోవింద్, ఏపీఓ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పాలంగిలో 1 నుంచి ఆప్తవాజపేయమ్ యాగం

భీమవరంటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : 1 నుంచి 15వ తేదీ వరకు తణుకు సమీపంలోని పాలంగి రోడ్డోని శ్రీభమిడి సూరన్న లే అవుట్లో శ్రీఉమా రామలింగేశ్వర ట్రస్టు (నెలమూరు) ఆధ్వర్యంలో ఆప్తవాజపేయమ్ (శరద్వాజ పేయమ్) మహాయాగాన్ని నిర్వహిస్తున్నట్లు యజ్ఞకమిటీ భీమవరం సభ్యులు వెంకటరాజు, రంగసాయి, బంగార్రాజు తెలిపారు. మహా యాగం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

వరాల వేంకటేశ్వరుడికి పూజలు

అత్తిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈడూరు వరాల వెంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

ఆచంట: ఆచంట ముత్యాలమ్మ గోగులమ్మ వార్ల హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించగా రూ. 92 వేల 474 రూపాయలు వచ్చినట్లు ఈవో సత్యనారాయణ తెలిపారు. గుమ్ములూరు ఆలయ అధికారి రాజా సమక్షంలో లెక్కించగా రెండేళ్లకు ఈ ఆదాయం వచ్చి తెలిపారు.

రీ సర్వేలో ఫిర్యాదుల వెల్లువ


చినకాపవరంలో తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఆకివీడు రూరల్ అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూమి రీ సర్వే పద్ధతి తమకొద్దు అని రైతులు తహసీల్దారు వెంకటేశ్వరరావుకు తెలిపారు. ఆకివీడు మండలం చినకాపవరం గ్రామంలో జరిగిన భూమి రీసర్వే గ్రామసభలో రైతులు తమ ఫిర్యాదులతో మోతెక్కించారు. దస్త్రావేజులలో ఉన్న భూమికి, రికార్డులలో భూమికి పొంతనలేకుండా పోయిందని, తాము భూమిని కోల్పోతున్నామని, ఇది తమకు సమ్మతం కాదని వారు తహసీల్దారుకు తెలియజేశారు. రీసర్వే అంతా తప్పుల తడకగా ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. తమకు పాతపద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేసారు. చినకాపవరంలో 26 ఫిర్యాదులు అందగా, ఇప్పటివరకు రీసర్వే సభలు ముగిసిన 4 గ్రామాలు అజ్జమూరులో 3, సిద్దాపురంలో 35, తరటావలో 38, కోళ్ళపర్రులో 16 ఫిర్యాదులు అందాయని తహసీల్దారు వెంకటేశ్వరరావు తెలిపారు. డిటి ఫారూక్ పాల్గొన్నారు.

ఉండి: ఉండి మండలం వెలివర్రులో శనివారం గ్రామ సచివాలయం వద్ద భూములకు సంబంధించి రీసర్వే గ్రామసభను ఏర్పాటుచేశారు. గ్రామానికి చెందిన మంతెన మురళీకృష్ణంరాజు, మంతెన శ్రీనివాసరాజులకు చెందిన 12.21ఎకరాల సెంట్లు భూములకు గాను 17సెంట్లు తగ్గిందని ఆరోపించారు. పుట్టా నరసింహమూర్తి 30 సెంట్లు, చొక్కాకుల అప్పలస్వామి 5 సెంట్లు భూమి తగ్గిందంటూ అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. గ్రామంలో సుమారుగా 26 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యవర్గసభ్యుడు పొత్తూరి వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ రీసర్వే వలన రైతులకు తీవ్రనష్టం జరిగిందని వారి సమస్యలను తీర్చడానికే ఈగ్రామసభలను ఏర్పాటుచేసిందన్నారు.

పెనుగొండ: సిద్ధాంతంలో రీ సర్వే అయిన గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. సమస్యలుపై వినతులను తహసీల్దార్ అనిత కుమారి కు అందజేశారు. వినతులను పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

'గ్రామసభలతో ఉపయోగం లేదు'

గణపవరం: భూముల రీసర్వే ప్రక్రియ పూర్తయిన తరువాతే గ్రామసభల్లో తమ సమస్యలు చెప్పుకునేందుకు ఉపయోగం ఉంటుందని ప్రస్తుతం జరుగుతున్న గ్రామ సభలు వలన ఉపయోగంలేదని అర్ధవరం రైతులు విమర్శించారు. శనివారం అర్ధవరంలో గ్రామంలో రెవిన్యూ సదస్సు జరిగింది. రైతులు పాతపాటి సీతారామరాజు, అడ్డాడ వెంకటరామరాజు, రుద్రరాజు సత్యనారాయణరాజు, గాదిరాజు వెంకట్రాజు తదితరులు గ్రామసభలో తమ గ్రామ రెవెన్యూ సదస్సుల వలన ఉపయోగంలేదని వినతిపత్రాన్ని అధికారులకు అందించారు.

మూడు వాయిదాల్లో బకాయి చెల్లిస్తా : ధవేజీ

నరసాపురం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రేవు పాట నిమిత్తం ప్రభుత్వానికి బకాయి పడ్డ రూ. 55 లక్షలను మూడు వాయిదాల్లో పూర్తిగా చెల్లిస్తామని పాత పాటదారుడు రెడ్డప్ప ధవేజీ జాయింట్ యాక్షన్ కమిటీకి తెలియజేశారు. శనివారం జెఏసీ సమావేశమై పెండింగ్ బకాయిపై చర్చించారు. ఈ సమాచారంతో ధవేజీ మండల పరిషత్ సమావేశానికి హాజరయ్యారు. తాను బకాయి పడ్డమొత్తాన్ని 3 వాయిదాల్లో చెల్లించే విధంగా వెసులుబాటు ఇవ్వాలని కోరారు. దానికి సంబంధించి మూడు చెక్‌లను కమిటీకి అందించారు. అలాగే బకాయి తీరిన తరువాత భవిష్యత్‌లో జరిగే రేవు పాటలో కూడా పాల్గొనే అవకాశం కల్పించాలి. తన పంటు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నందున్న దానికి సంబంధించిన రోజువారి అద్దెను తనకు ఇవ్వాలని కోరారు. బకాయి తీరిన తరువాత ఈమొత్తాన్ని సెటిల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జెఏసీ సానుకూలంగా స్పందించింది. ధవేజీ లిఖితపూర్వకంగా ఇచ్చిన వినతి జిల్లా అధికారులకు తెలియజేసి దానికి అనుగుణంగా వ్యవహరిస్తామని ఎంపీడీవో రామకృష్ణంరాజు చెప్పారు. ఎంపీపీ సోని, సూపరింటెండెంట్ వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.



డీఈవోను సన్మానించిన హెచ్ఎంల సంఘం

తణుకు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన డీఈవోగా బాధ్యతలు చేపట్టిన నారాయణను శనివారం డీఈవో కార్యాలయంలో ఆయనను జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కలిసి సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు నేలపాటి వెంకట రమణ, గౌరవాధ్యక్షుడు శ్రీమన్నారాయణ, పలువురు ఎంఈవోలు పాల్గొన్నారు.

టీఎల్ఎం బోధన పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు టీఎల్ఎం మెటీరియల్‌తో అందిస్తున్న బోధన బాగుందని సర్వశిక్షా అభియాన్ సీఎంవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. పెదతాడేపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం బోధనపై సమీక్షించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఎంఈవోలు వి. హనుమ, పీఎంకే జ్యోతి, ప్రిన్సిపాల్ బి. రాజారావు పాల్గొన్నారు.

మానవత సేవలు భేష్

పెంటపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మానవత సేవలు అభినందనీయమని ఎంఈవో టీవీ రామకృష్ణ అన్నారు. మానవత జిల్లా పర్యావరణ కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహన్‌రావు ఆధ్వర్యంలో శనివారం బోడపాడులో సమావేశాన్ని నిర్వహించారు. సంస్థ మండల అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అనంతరం గ్రామానికి కొబ్బరి మొక్కలను అందజేశారు.

టీచర్ల సంక్షేమానికి కృషి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పాటుపడతానని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపికృష్ణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూలులో ఉపాధ్యాయులతో మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.